

## సబితాఇంద్రారెడ్డిని అభినందించిన కేటీఆర్

తెలంగాణ భవన్‌లో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్యేల సమావేశంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిచిన సబితా ఇంద్రారెడ్డికి ఈ సందర్భంగా కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ యువ నాయకుడు పి. కార్తిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– బడంగ్‌పేట్, డిసెంబర్ 4



నూతనంగా నియమితులైన రాష్ట్ర డీజీపీ రవి గుప్తాను సోమవారం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

– సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ)

## 8 నుంచి లైఫ్‌స్టైల్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్

### లేబుల్‌ను ఆవిష్కరించిన సినీనటి మంచు లక్ష్మి



లేబుల్‌ను ఆవిష్కరిస్తున్న సినీనటి మంచు లక్ష్మి

సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): కాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ (సీసీటీ) సౌజన్యంతో హైటెక్స్ వేదికగా ఈ నెల 8, 9వ తేదీల్లో లైఫ్‌స్టైల్ ఫ్యాషన్ ఆభరణాల ఎగ్జిబిషన్ జరుగనుంది. సోమవారం రాడిసన్ బ్లూ హోటల్‌లో గ్లామ్ పరిక్రమ లేబుల్ కార్యక్రమానికి సినీనటి మంచు లక్ష్మి హాజరై ఆవిష్కరించారు. నిర్వాహకులు సోనాచత్వానీ, లలితా జార్జ్, మల్లికారాణి షెట్టి, శోభా సుధాకర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఫ్యాషన్, ఆభరణాలు, లైఫ్‌స్టైల్‌కు అనుగుణంగా ఆకట్టుకుంటున్నాయని మంచు లక్ష్మి పేర్కొన్నారు. 150 స్టాల్స్ ఎగ్జిబిషన్‌లో కొలువుదీరనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఉస్మానియాతో యూఎస్ వైద్యుల ఎంవోయూ



సుల్తాన్ బజార్, డిసెంబర్ 4 : అనస్థీషియా రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గాను హాస్పిటల్ ఫర్ స్పెషల్ సర్జరీ న్యూయార్క్‌తో ఎంవోయూ చేసుకున్నట్లు ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ పేర్కొన్నారు. సోమవారం యూఎస్‌ఏ న్యూయార్క్ స్పెషల్ సర్జరీ వైద్యులు డాక్టర్ ఎరికా టపురో, డాక్టర్ లూసియా లీ, డాక్టర్ జైసర్ హైదర్, లార్స్ నూడ్‌సెన్ తదితరులు ఉస్మానియా దవాఖానను సందర్శించారు. ఉస్మానియా దవాఖానతో పాయింట్ ఆఫ్ కేర్ అల్ట్రాసౌండ్(పోకస్)లో శిక్షణ ఇచ్చేందుకు గాను ఎంవోయూ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా దవాఖాన అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, అనస్థీషియా విభాగం హెచ్‌వోడీ డాక్టర్ పాండు నాయక్, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

"ఐటీ ఉద్యోగి అయిన ప్రభుదాస్... ఉద్యోగం కోసం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఇన్నాళ్లు బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్, కేటీఆర్ చేసిన అభివృద్ధి పనులు ఆయన్ను ఆ పార్టీకి అభిమానిని చేశాయి. ముఖ్యంగా ఐటీ రంగంలో 20 ఏళ్ల అనుభవం ఉన్న ఆయన.. ఐటీలో వచ్చిన మార్పులను కళ్లారా చూశారు. ఈసారి బీఆర్‌ఎస్ ఎన్నికల్లో ఓడిపోవడం, ముఖ్యంగా విదేశీ కంపెనీలను తీసుకురావడంలో ఐటీ మంత్రిగా కేటీఆర్ చూపిన చొరవ ప్రభుదాస్‌కు ఎంతగానో నచ్చింది. ఇదే విషయాన్ని తన తోటి ఉద్యోగులతో పంచుకుంటూ మదనపడ్డారు."

" యువతకు రోల్ మాడల్‌గా నిలిచిన కేటీఆర్ ఇన్నాళ్లు ఐటీ మంత్రిగా చేసిన పనులను గుర్తు చేసుకుంటూ... తెలంగాణ యువత నిన్ను చాలా మిస్ అవుతున్నారు అన్నా.. నా వయస్సు 23 ఏళ్లు. ఇప్పటివరకు నేను ఒక్కసారి కూడా ఏడవలేదు. కానీ ఈ రోజు ఆటోమేటిగ్గా కన్నీళ్లు వచ్చేస్తున్నాయి" అంటూ బరువెక్కిన గుండెతో ట్వీట్ చేశారు.

"దశాబ్ద కాలంలో రాష్ట్రాన్ని అద్భుతంగా పాలించిన కేసీఆర్, కేటీఆర్ గారు.. మీకివే మా ప్రత్యేక ధన్యవాదాలు. ఇదీ నమ్మ శక్యంగా లేదు, హృదయ విధారకరమైన విషయం"

# అధినేత వెన్నంటే ఉంటాం

- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మద్దతుగా..
- సామాజిక మాధ్యమాల్లో అభిమానుల ట్వీట్లు
- అండగా ఉంటామంటూ సోషల్ మీడియా వేదికగా ప్రకటన

సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ప్రజా తీర్పును శిరసావహిస్తూనే... బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతోపాటు పార్టీ అధిష్ఠానానికి వెన్నంటి ఉంటామని బీఆర్‌ఎస్ అభిమానులు పేర్కొంటున్నారు. ఆపద సమయంలోనే అండగా ఉంటామని చెబుతూ... సామాజిక మాధ్యమాల్లో వెల్లువలా మద్దతు తెలుపుతున్నారు. సోషల్ మీడియాలో వేదికగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు తమ అభిప్రాయాలను ట్వీట్ల ద్వారా తెలియజేస్తున్నారు. ఆరునూరైనా మీకు అండగా ఉంటామంటూ సోషల్ మీడియా వేదికగా ప్రకటనలు వెలువడుతున్నాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో చావునోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన బీఆర్‌ఎస్ అధినేతతోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్‌కు అండగా ఉండాల్సిన బాధ్యత, సమయం ఆసన్నమైందంటూ పోస్టులు పెడుతున్నారు.

### అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలి..

అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం అభివృద్ధి సంక్షేమ పథకాలను వేగవంతంగా అమలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని వివరించారు. కొనసాగిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాల వివరాలను పోస్టుల్లో పేర్కొంటున్నారు. ఆపద సమయంలో అండగా ఉండాలని ప్రకటించారు. 'తెలంగాణను నిజంగా ప్రేమించే నాలాంటి వారెందరో కలలో కూడా ఊహించని ఈ చేదు నిజాన్ని జీర్ణించుకోవడం చాలా కష్టంగా ఉంది' అని ఓ యువకుడు పోస్టు చేస్తూనే.. రాష్ట్ర అభివృద్ధి కోసం పెద్దసారుకు దన్నుగా నిలుద్దాం అని రాసుకొచ్చాడు. 'హుందాతనంతోని మీరు ప్రజా ఆదేశమని గౌరవిస్తున్నారు. బాధపడకండి, మనం తెలంగాణ రాష్ట్ర బాగు కోసం ఎప్పటికీ పోరాడుతూనే ఉందాం. పోరాటాలు, ఉద్యమాలు మనకేం కొత్త కాదు' అని మరో యువకుడు తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు.

### కోల్పోయింది ధైర్యాన్ని కాదు..

'ఓడిపోయింది అభ్యర్థులు మాత్రమే.. కానీ ఆ అభ్యర్థుల ధైర్యాన్ని ఏమాత్రం కాదు'.. ఈ రోజు ఓటమి.. రేపటి గెలుపునకు నాందిగా నిలుస్తుంది అని ఓ యువతి ధైర్యాన్ని మద్దతుగా ఇచ్చింది. 'నిరంతరం శ్రమతో నూతన ఆలోచనలతో నా తెలంగాణ కోటి రతనాల వీణ అని చెప్పుకున్న స్థితిలో నిలబెట్టిన నేతకు అండగా ఉండాలి', నిజం తెలుసుకోవాలని అంటూ తమ, తమ అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 'ప్రాణమున్నంత వరకూ గులాబీ జెండా వదిలేదే.. లేదు. మీరు మీ శాయశక్తులా పోరాడిన తీరు అమోఘం, నేను చాలా దగ్గరగా మిమ్మల్ని అనుసరించాను. మీ పనితనం గ్రేట్' అంటూ మరొకరు




ట్వీట్ చేశారు. 'గెలుపోటములు సహజమే అయినా.. ఉద్యమ నాయకులు కేసీఆర్, కేటీఆర్‌లకు అండగా ఉండాల్సిన సమయమిది.

### ప్రాంతాలకతీతంగా మద్దతు

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో యాక్టివ్‌గా ఉండే నెటిజన్లు కూడా ప్రాంతాలు, పార్టీలకతీతంగా బీఆర్‌ఎస్ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో అందుబాటులోకి వచ్చిన కంపెనీలు, జరిగిన అభివృద్ధి, కేటీఆర్ లాంటి డైనమిక్ లీడర్ పనితీరు జనాలకు ఎంతగానో నచ్చింది. దీంతో స్వచ్ఛందంగా పార్టీకి మద్దతు తెలుపుతూ పార్టీతో, నేతలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ నెట్టింట్లో పంచుకుంటున్నారు. ముఖ్యంగా బీఆర్‌ఎస్ నేతలకు మద్దతుగా నిలుస్తున్నారు. పార్టీ ఓటమిని తమ ఓటమిగా భావించి మదనపడుతున్నారు. ముఖ్యంగా కేటీఆర్ విషయంలో యువత స్పందిస్తున్న తీరు... సాధారణ ఓటర్లను కూడా పునరాలోచనలో పడేలా చేస్తోంది.

## ఘంటసాల అభిమానిగా గ్రంథావిష్కరణ



ఘంటసాల అభిమానిగా గ్రంథావిష్కరణ చేస్తున్న ఓలేటి పార్వతీశం, ఇతర ప్రముఖులు

రవీంద్రభారతి, డిసెంబర్ 4 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సాంస్కృతిక కళాబంధు సారిపల్లి కొండల్‌రావు సారథ్యంలో యువకళావాహిని నిర్వహణలో గాన గంధర్వుడు ఘంటసాల 102వ జయంతి సందర్భంగా మద్దాళి రఘురామ్ రచించిన ఘంటసాల అభిమానిగా గ్రంథావిష్కరణ కార్యక్రమం సోమవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. సారిపల్లి కొండల్‌రావు సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి వక్తలుగా ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాధాకృష్ణకు తొలి ప్రతిని అందజేశారు. ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ ఎన్‌టీఆర్, ఏఎన్‌ఆర్‌కు పాటలు పాడిన గొప్ప గాయకుడు ఘంటసాల అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువకళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, డా.జె.చెన్నయ్య, ఎస్.వి రామారావు పాల్గొన్నారు. సభకు ముందు ఘంటసాల గాన మధురిమలు సంగీత సితారే కార్యక్రమం వీక్షకులను ఆకట్టుకున్నది.

## మేడ్చల్ జిల్లాలో.. నోటాకు 15,418 ఓట్లు

మేడ్చల్, డిసెంబర్4(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకు 15,418 మంది ఓట్లు వేశారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల్లో 28,19,292 ఓటర్లు ఉండగా అసెంబ్లీ ఎన్నికల్లో 15,83,675 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 15, 418 మంది ఓటర్లు నోటాను వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. నోటాను మేడ్చల్ నియోజకవర్గంలో 3737, మల్కాజిగిరిలో 2608, కుత్బుల్లాపూర్‌లో 4079, కూకట్‌పల్లిలో 2458, ఉప్పల్‌లో 2536 మంది ఓటర్లు వినియోగించుకున్నారు.

## కేటీఆర్ మంత్రిత్వ శాఖలో పనిచేయడం నా అదృష్టం

### టీఎస్‌టీఎస్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన జగన్మోహన్ రావు



సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ ) : తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్) చైర్మన్ పదవికి పాటిమీది జగన్మోహన్‌రావు సోమవారం రాజీనామా చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తన రాజీనామా లేఖను సమర్పించారు. తెలంగాణ ఉద్యమం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ ఏ పిలుపునిచ్చినా.. అన్ని కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన జగన్‌కు కేసీఆర్ టీఎస్‌టీఎస్ బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ఐటీ శాఖకు కేటీఆర్ ఎనలేని వన్నె తీసుకువచ్చారన్నారు. కేటీఆర్ మంత్రిత్వ శాఖలో తాను పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలకు అనుగుణంగా అందరిలాగే తాను పనిచేస్తానని స్పష్టం చేశారు.